# జబ్బు కుదిరింది! ★

రచన:
వై. రమణమూర్తి

నా ఫ్రెండు నరసింహారావు చాల హుషారైన మనిషి. చదువు, రాజకీయ పరిజ్ఞానమూ మినహాయిస్తే మిగతా లౌకికవిషయాలలో అందెవేసిన చేయి. అందులోనూ ముఖ్యంగా 'ప్రేమ' విషయాలలో మా నరసింహం పేరు ముందు చెప్పాలి. వాడెప్పుడూ నలుగురూ కూడిన చోటల్లా సందర్భం కల్పించుకొని ప్రేమగురించీ, ప్రణయకలాపాల గురించీ, స్వదేశ, విదేశ ఉదాహరణలతో లెక్చర్లు దంచేసేవాడు. వాడు చెప్పిన విషయాలు విని పొందిన ఆశ్చర్యంకంటే, వాడు వాగిన డబ్బాకి అంతా ఆశ్చర్య పోయేవారు. రావు నాకు స్నేహితుడు అవడం చేత తరచూ మాయింటికి వస్తూండేవాడు. మేమిద్దరం స్కూల్ఫైనలే—చదువు తున్నాం.

మా నరసింహం ప్రేమజబ్బు యీ సంవత్సరం మొదటి నుండీ 'నార్మల్' దాటడం గ్రహించేను! చాల సార్లు మందలించేను కూడా, అప్పటికి సరేనన్నా వాడికాబుద్ధి పోలేదు. స్కూల్ వదలిపెట్టగానే యిళ్లకు పోతూ ఉండే అమ్మాయిల కెదురుగా వచ్చి కాలర్లు ఎగరేయటం, సైడ్ పోజులివ్వడం కూడా మొదలుపెట్టేడు ఒకనాడు ప్లీడరు రమాకాంతం గారి అమ్మాయి ప్రక్కగా సైకిల్ తీసుకొని వెళ్తూండగా—ఆ అమ్మాయికి కోపం వచ్చిందేమో—చేత్తో హేండిల్ బార్ ప్రక్కకి నెట్టి, తిట్టుకుంటూ వెళ్లి హెడ్మాస్టార్కు రిపోర్టు చేసింది. పాపం! మా నర్సింహం అక్కడ సైడ్ కాలువలో పడిపోయాడు; క్లాసులో గర్ల్సుముందు హెడ్మాస్టర్చేత నానా చీవాట్లు తిన్నాడు. కాని మావాడు గొప్ప వేదాంతికూడా! క్షణభంగురమైన మానవ శరీరానికి కలిగే అవమానాలను లెక్కతో వేసే రకం కాదు.

ఒకనాడు నర్సింహం మా యింటికి వచ్చే నరికి మాకు యిల్లు అద్దె కిచ్చిన శ్యామసుందరంగారి అమ్మాయి స్వర్ణ, మా యింట్లో మా చెల్లెలుతో మాట్లాడుతోంది. మావాడి కళ్లు ఆమె మీద ఆటోమెటిక్ గా పడ్డాయి. స్వర్ణ అందమైన పిల్లే చాల కలసి మెలసి తిరిగె పిల్ల. ఒకే యింట్లో ఉండటంచేత తరచూ మా యింటికి వస్తూండేది. రావు మాయింటికి వచ్చి ఉన్నప్పుడు కూడా రెండు మూడు సార్లు వచ్చింది. అపుడప్పుడూ మాటల సంవర్భంలో మా వాడి తెలివి తక్కువ మాటలు విని నవ్వేది. ఆ నవ్వుని చూచి ప్రణయానికి నాంది అనుకొనే వాడు. ఇలా రెండు మూడు సార్లు వాడున్నప్పుడు, ఆ అమ్మాయి తాత్కాలికంగా రావడం, తన తెలివి తక్కువ మాటలకి నవ్వడం, చూచి ఆమె తనని ప్రేమిస్తోందని స్థిరపరచుకొన్నాడు కాని, యీ విషయాలన్నీ మొదట నాకు చెప్పలేదు. నే నెక్కడ వద్దంటానో, అని.

మా పబ్లిక్ పరీక్ష లైపోయాయి. గర్ల్స స్కూ ల్ పరీక్షలప్పుడే అరంభ మయ్యాయి. పరీక్ష లైపోయాయి కదా అని నేను, నర్సింహం ఓ నాడు మాయింట్లో పేకాడుకుంటున్నాం. ఇంతట్లో స్వర్ణవచ్చి" ఏమోయ్ శ్రీనివాస్! కంపాస్బాక్సు ఉంటే ఒకసారి యిస్తావా? రేపు మాలెక్కల పరీక్ష. మా చెల్లి నా బాక్సెక్కడో పడేసింది. కన్పించటం లేదు" అంది.

"నాకు లేదు స్వర్ణా! ఏ ఫ్రెండ్ నడిగో తెచ్చి ఆ అవుసరం దాటిపోగానే తిరిగి యిచ్చేస్తుంటాను" అని స్వర్ణతో చెప్పి, "ఏంరా! నర్సింహం నీ దగ్గర గాని ఉందా?" అని మా వాడిని అడిగేను. వాడు "ఉందిరా" అని నాతో చెప్పి, ఆమెవైపు తిరిగి, సాయంత్రం తెచ్చిస్తాను లెండి" అన్నాడు. స్వర్ణ చిరునవ్వు నవ్వుతూ సరేనని వెళ్లిపోయింది.

ఆమె వెళ్లిన వెంటనే మావాడు ఏదో జ్ఞాపకం వచ్చినట్లు "ఒరే శ్రీనివాస్! యింటి దగ్గర చాలపని ఉందిరా. మర్చిపోయేను. మళ్లీ సాయంత్రం వస్తానులే" అంటూ వెళ్లిపోయేడు. సాయంత్రం 5 గంటలకి కంపాస్ బాక్సుతో సహా మా యింటికి వచ్చేడు. స్వర్ణ మా చెల్లెలు లతతో మాట్లాడు తోంది. నర్సింహం బాక్సు ఆమె కిచ్చాడు. ఆమె థాంక్స్" అని చెప్పి వాళ్లింటికి వెళిపోయింది.

* * *

మర్నాడు యింటాయన శ్యామసుందరం గారు ఎవరి మీదో కేకలేస్తున్నారు. ఇంటావిడ భర్తను వారిస్తోంది. ఎవరా, ఆ చీవాట్లు తింటున్న మహానుభావు డని చూచేను. ఇంకెవరు?........ అస్మదీయ మిత్రముండైన నర్సింహమే! బుఱ్ఱ వంచుకొని యింటాయన కెదురుగా నిలబడి ఉన్నాడు. శ్యామ సుందరంగారంటున్నారు. "ఇంకా సరిగ్గా మాటాడ్డమైనా రాదు, ప్రణయ కలాపాలట! ప్రణయ కలాపాలు! ఇంట్లో తలిదండ్రు లెన్ని కష్టాలైనాపడి, పిల్లడికి కష్టం తెలియకుండా పెంచుతూ ఉంటే, ఒళ్లు పొగరెక్కి చేసినపని కాదుటోయ్, యిది? ప్రేమవేశలట! ప్రేమ లేఖలు! ప్రేమ అంటే అర్థమైనా తెలుసునూ? పెళ్లి చేసుకోవాలట! పెళ్లి! నీ పొట్టనైనా నువ్వు పోషించుకోలేవు. పెళ్లాన్ని పోషించటానికి తాహతు ఉందా? లేకుంటే రోడ్డు మీద పోతూండే ఆడపిల్లల్ని చూస్తూండడమే తెల్సునా?" అని అతనంటూంటే మా వాడు బిక్క చచ్చిపోయి 60 నిమ్నకోణంలో చూస్తూ ఉండిపోయేడు.

అతనింకా అంటున్నాడు. అతని భార్య వారిస్తోంది. కాని అతనాగలేదు. "కంపాస్ లోను, పుస్తకాల్లోను పెట్టి ప్రేమలేఖ లందివ్వడమట! ఇంట్లో తలిదండ్రులు డబ్బు కిబ్బంది పడుతున్నా వారిని మాయచేసి డబ్బులు సంపాదించి, సినీమాలు చూడడం యివి నేర్చుకుందుకే కావల్సు.

ఏం, వాళ్ల శ్రీనివాస్ నీ తోటి వాడుకాదా? ఎంత బుద్ధిగా ఉంటున్నాడు? మీ నాన్న గారితో, గట్టిగా మందలించమని చెప్తానుండు అని ఆయనంటూంటే, వాడి కళ్లనుండి రెండు వేడి కన్నీటి బిందువులు రాలేయి. ఇకనుంచైనా బుద్ధిగా మసలుకో. వెళ్లు." అని ఆయన చాలించేరు. మా నర్సింహం తెల్లమొహంవేసుకొని బయటికి నడిచేడు, సంగతి కొంత కొంత తెలిసినా, పూర్తిగా అవగాహన కాకపోవటంచేత, సంగతేమిటని మా చెల్లిని అడిగేను.

"ఏం లేదన్నయ్యా మీ స్నేహితుడు కంపాస్లో ప్రేమలేఖపెట్టి స్వర్ణకిచ్చేడట, ఆ పిల్ల అది చూడనేలేదు. పరీక్షనాడు బాక్సు స్కూలుకి పట్టుకెళ్లిందట. మరో అమ్మాయి బాక్సు బాగుందమ్మా చూస్తానంటూ, తెరిచి, ఆ ప్రేమలేఖని చదివిందట. చదివింది ఊరుకోక అందరికీ చూపించిందట, స్వర్ణ స్కూలునుండి వచ్చేక, ఏడుస్తూ వాళ్లమ్మతో చెప్పిందట. ఆవిడ శ్యామసుందరం గారితో చెప్పేరట. సాయంత్రం నర్సిహం మనింటి కొస్తూంటే, అతనేదో అత్యవసరం ఉన్నట్లు, మీ స్నేహితుణ్ణి పిలిచి తరువాతి సంగతి నీకు తెల్సిందేగా" అని చెప్పింది. స్నేహితునికి జరిగిన పరాభవానికి కించిత్తు విచారించేను.

మర్నాటి నరికి మా నర్సింహం జబ్బు కుదిరి పోయింది కాని, మా వీధికి రావడం మానేశాడు ఎంచేతో.... ఎవరైనా, యిప్పుడు వాడి దగ్గర ప్రేమ భోగట్టా ఎత్తేరంటే, "ఎందుకురా, ఆపనికి మాలిన గొడవ? ఫర్దర్ స్టడీస్ పాడవుతాయి" అని అంటాడు.

★